సాక్షి వికారాబాద్

మంగళవారం । 26 । నవంబర్ । 2024



చోరీ ముఠా గుట్టురట్టు

ఫామ్‌హౌస్ నిర్మాణాల వద్ద సెంట్రింగ్ బాక్స్‌లను చోరీ చేసే ముఠాను చేవెళ్ల పోలీసులు పట్టుకున్నారు. 8లో▸



పోటెత్తిన భక్తులు

హిందూ జనశక్తి, మాణిక్ ప్రభు సంస్థాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏటా గిరిప్రదక్షిణ నిర్వహిస్తుంటారు. 8లో▸



నిప్పు.. దిగుబడికి ముప్పు!

పంట కోత అనంతరం వరి కొయ్యలకు నిప్పు పెట్టడం మంచిది కాదని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

కొడంగల్ రూరల్: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, తెలుగు, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని, స్టోర్ రూమ్‌లోని బియ్యంను పరిశీలించారు. బియ్యంలో పురుగులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. వారంలో ఎన్ని సార్లు గుడ్లు ఇస్తున్నారని, కూరగాయలు, సరుకులు నాణ్యతగా ఉన్నాయా, వంట రుచికరంగా ఉందా అని ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఎంఈఓ రాంరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుంటాం

బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్



బీసీ సమరభేరి సభకు వెళ్తున్న సంఘం నాయకులు

తాండూరు టౌన్: భవిష్యత్‌లో బీసీలు రాజ్యాధికారం చేజిక్కించుకోవడం ఖాయమని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో తలపెట్టిన బీసీల సమరభేరి సభకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. చట్ట సభల్లో బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అత్యధిక సంఖ్యలో ఉన్న బీసీలకు రాజ్యాధికారం అందని ద్రాక్షలా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో బీసీలంతా ఏకమై రాజ్యాధికారం చేజిక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సయ్యద్ షుకూర్, వెంకటేశ్, మధులత, లక్ష్మణాచారి, బస్వరాజ్, నరేందర్, బసంత్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి డీబీ సీతల్



పరిగి: క్షణికాశంలో తప్పు చేసి జైలుకు వెళ్లడం ద్వారా కుటుంబం మొత్తం క్షోభిస్తుందని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి డీబీ సీతల్ అన్నారు. సోమవారం ఆమె పరిగి సబ్ జైలును సందర్శించారు. ఖైదీల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రోజువారి దినచర్య, వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసిన తప్పులను పునరావృత్తం కాకుండా చూసుకోవాలన్నారు. జైలు నుంచి విడుదలైన తరువాత రెండో సారి ఇక్కడికి రాకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కుటుంబంపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, లీగల్ డిఫెన్స్ లాయర్ రాము, వెంకటేష్, శ్రీనివాస్, గౌస్‌పాష పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పూర్తి

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలో కులగణన సర్వే పకడ్బందీగా సాగుతోందని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, ఇబ్రహీంపట్నం స్పెషలాఫీసర్ కె.నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని 14 పంచాయతీల్లో 11,151 ఇళ్లను గుర్తించి 110 ఎన్యుమరేటర్ బ్లాక్‌లను ఏర్పాటు చేసి సర్వే చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 10,984 ఇళ్లను సర్వే(98.5శాతం) పూర్తి చేశామన్నారు.

ధారూరులో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం



బోర్డులతో సరి

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

- స్థలం కేటాయించి వదిలేసిన వైనం
- పిచ్చిమొక్కలతో నిండిన మైదానాలు
- క్రీడా పరికరాలు మంజూరు చేయని ప్రభుత్వాలు
- ఆటలకు నోచుకోని గ్రామీణ క్రీడాకారులు

వికారాబాద్: తెలంగాణ క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. మూడేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన స్థలాన్ని చదును చేసి బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. అప్పట్లో పలు చోట్ల స్థల వివాదాల కారణంగా క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు తహసీల్దార్లు నానా ఇబ్బందులు పడ్డారు. భూమి కేటాయించిన తర్వాత ప్రభుత్వం క్రీడా సామగ్రి పంపిణీ చేయలేదు. కేవలం భూమిని చదును చేసి వదిలేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చక్కటి ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉన్నా ఆడుకునేందుకు సరైన స్థలం, క్రీడా పరికరాలు లేక మరుగున పడుతున్నారు.

అరకొర స్థలంలో..

క్రీడా ప్రాంగణాల్లో మౌలిక వసతులు లేకపోవడంతో వాటిని వినియోగించడం లేదు. ప్రస్తుతం గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోతున్నాయి. అర ఎకరంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతో క్రికెట్ ఆడేందుకు వీలు లేదని పలువురు క్రీడాకారులు అంటున్నారు. కనీసం మూడు ఎకరాల స్థలం ఉంటే అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. ఒకే చోట స్థలం అందుబాటులో లేకుంటే రెండు మూడు గ్రామాలకు కలిపి ఒక చోట క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసు కోవాలని అన్నారు. క్రీడా ప్రాంగణాల నిర్వహణకు ఏటా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, వాటి నిర్వహణ బాధ్యతలు గ్రామ పంచాయతీలకు అప్పగించి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తే వాటి వినియోగం బాగుంటుందని పలువురు పేర్కొన్నారు.

585 జీపీల్లో మైదానాలు

జిల్లాలోని 585 గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. 2 వేల చదరపు గజాలు లేక 20 గుంటల భూమికి తగ్గకుండా కేటాయించారు. ఇందుకోసం గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిని, అటవీ భూములను సేకరించారు. స్థలాల అభివృద్ధికి రూ.50వేల వరకు ఖర్చు చేశారు. ప్రభుత్వ భూమి లేనిచోట జీపీల్లో లేఅవుట్లు చేస్తే వాటి ద్వారా సామాజిక అవసరాల కింద ఇచ్చే 10 శాతం భూమిని క్రీడా ప్రాంగణాల కోసం గుర్తించేందుకు వీలు కల్పించారు. ఇలా జిల్లా పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. అయితే మౌలిక వసతులు కల్పించకపోవడం, క్రీడా సామగ్రి మంజూరు చేయకపోవడంతో మైదానాలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఆటలు ఆడేందుకు అనుకూలంగా లేదు. ఆటల వారీగా కోర్టుల నిర్మాణం చేస్తే బాగుంటుందని క్రీడాకారులు అంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చొరవ తీసుకోవడంతోపాటు క్రీడా సామగ్రి, ఏటా ప్రత్యేక నిధులు కేటాంచాలని కోరుతున్నారు.



◆ కార్తీక శోభ

కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన సేవ నిర్వహించారు. ఈ వేడుకలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాన్ని ఆలయ ఈఓ సుధాకర్, అర్చకులు పాండుశర్మ దగ్గరుండి పర్యవేక్షించారు.

– కుల్కచర్ల



◆ భక్తిశ్రద్ధలతో చక్రతీర్థం

అనంతగిరి గుట్టలో వెలసిన అనంతపద్మనాభ స్వామి పెద్ద జాతర సోమవారం జరిగిన చక్రతీర్థంతో ముగిశాయి. వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య చక్రతీర్థం వేడుక నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఈవో నరేందర్, ధర్మకర్త పద్మనాభం తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి భక్తులు సమర్పించిన కోడెలకు వేలం నిర్వహించారు. దీని ద్వారా ఆలయానికి రూ. 69,700 ఆదాయం వచ్చినట్లు ఈవో నరేందర్ తెలిపారు.

– అనంతగిరి



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

న్యాయం జరిగేలా చూస్తాం

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య
- లగచర్ల ఘటనపై పూర్తి నివేదికను సీఎంకు సమర్పిస్తామని వెల్లడి

పరిగి: లగచర్ల రైతులకు అన్ని విధాలా న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. లగచర్లలో బాధిత రైతు కుటుంబాలను కలిసేందుకు వెళ్తున్న బృందం సభ్యులు సోమవారం పరిగి పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఫార్మాసిటీ భూ బాధిత రైతులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం లాక్కోవాలని చూడటం సరికాదన్నారు. భూ సేకరణ పేరుతో అధికారులు గ్రామాలు, తండాల్లో సభలు నిర్వహించి రైతులను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. లగచర్ల ఘటనలో ఎవరో కొంత మంది కలెక్టర్, అధికారులపై దాడి చేస్తే రైతులందరిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. లగచర్ల ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులను కోరామన్నారు. బాధిత రైతులను కలిసి పూర్తి సమాచారం సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి, రాము బాబునాయక్, డీబీఎఫ్ జాతీయ క్యాదర్శి, జిల్లా నాయకుడు శంకర్, ప్రజా సంఘాల నాయకులు ఘట్యానాయక్, ముకుంద నాగేశ్వర్, శ్రీనివాస్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణం కల్పించండి

అనంతగిరి: లగచర్ల, రోటిబండ తండాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా చొరవ చూపాలని కలెక్టర్, ఎస్పీలను ఆదేశించినట్లు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. ఫార్మాసిటీ గ్రామాల సందర్శన అనంతరం వారు వికారాబాద్ సమీపంలోని అనంతగిరికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లగచర్ల, రోటిబండ తండా గ్రామాలను తమ బృందం సందర్శించి అక్కడి ప్రజలతో సమావేశమైనట్లు తెలిపారు. తండావాసులు భయాందోళనలో ఉన్నారని, ఫార్మాసిటీకి భూములు పోతే మా పిల్లలు ఏం చేసుకుని బతకాలనే బాధను వ్యక్తం చేశారని పేర్కొన్నారు. కలెక్టర్, అధికారులపై దాడి చేయడం మంచి పద్ధతి కాదని రైతులకు చెప్పామని అన్నారు. భూములు ఇవ్వమనే విషయాన్ని శాంతియుతంగా చెప్పాలి కదా అని సూచించినట్లు తెలిపారు. అమాయకులపై కేసులు పెట్టారని వారు మా దృష్టికి తెచ్చారని, దాడితో సంబంధం లేని వారిపై కేసులు ఎత్తి వేయాలని ఎస్పీకి ఆదేశించినట్లు తెలిపారు.

నాలా అనుమతులివ్వండి

- నవాబుపేట తహసీల్దార్‌కు సినీ నటుడు ఆలీ దరఖాస్తు

వికారాబాద్: నవాబుపేట మండలం ఎక్‌మామిడి గ్రామంలోని తన వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు నాలా అనుమతులు ఇవ్వాలని కోరుతూ సినీ నటుడు ఆలీ దరఖాస్తు చేసుకున్నారు. సర్వే నంబర్ 340, 341, 343, 344లో ఆలీకి సుమారు 8 ఎకరాలకుపైగా వ్యవసాయ భూమి ఉంది. ఇందులో కొన్నేళ్ల క్రితం ఓ ఫామ్ హౌస్ నిర్మించుకున్నారు. ఇటీవల మూడెకరాల్లో రిసార్ట్స్, కన్వెన్షన్ హాల్ తదితర నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందుకోసం ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడంతో ఈనెల 5న పంచాయతీరాజ్ అధికారులు అతనికి నోటీసులు అందజేశారు. ఆలీ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో.. ఎక్‌మామిడి పంచాయతీ కార్యదర్శి శోభ గత 22న మళ్లీ నోటీసులు అందజేశారు. ఈ సారి స్పందించిన ఆయన సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి 5.20 ఎకరాల భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలని కోరుతూ తహసీల్దార్ జైరామ్‌కు దరఖాస్తు చేసుకున్నారు.



తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటున్న ఆలీ

సింహగర్జనను విజయవంతం చేద్దాం

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్

దోమ: నగరంలో డిసెంబర్ ఒకటిన జరిగే మాలల సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ కోరారు. సోమవారం దోమ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాలల సింహగర్జన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సింహ గర్జన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి మాలలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు హన్మంతు, ఉపాధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి ఆంజనేయులు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నర్సింహులు, నవీన్, సలహాదారులు శ్రీనివాస్, మహేందర్, వెంకటేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

కుల్కచర్ల: మాలల సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేద్దామని మాల మహానాడు జిల్లా నాయకుడు సుల్తాన్‌పూర్ వెంకటయ్య అన్నారు. సోమవారం చౌడాపూర్ మండల కేంద్రంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాలల హక్కుల పరిరక్షణ కోసం, అవకాశవాద వర్గీకరణను అడ్డుకునేందుకు ఏకమై ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. డిసెంబర్ ఒకటిన నగరంలో జరిగే బహిరంగ సభను మాలలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, యాదయ్య, బాలయ్య, కృష్ణయ్య, రాజు, నర్సింలు, చెన్నయ్య, ఆంజనేయులు, రాజయ్య, కృష్ణయ్య, నర్సింలు,రాము, స్వామి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



దోమ: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్



కుల్కచర్ల: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

వేసెక్టమీపై అవగాహన కల్పించాలి

అనంతగిరి: కుటుంబ నియంత్రణ గురించి భార్యభర్తలు మాట్లాడుకోవడం ఈ రోజు నుంచే ప్రారంభించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వై.వెంకటరవణ అన్నారు. వేసెక్టమీ పక్షోత్సవాలను పురస్కరించుకుని సోమవారం వికారాబాద్‌లోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు వేసెక్టమీ అవగాహన కల్పించాలన్నారు. ఈ ఆపరేషన్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు వికారాబాద్ జిల్లా ఆస్పత్రిలో వేసెక్టమీ ఆపరేషన్లు చేయించాలన్నారు. వచ్చే వారం నుంచి ట్యూబెక్టమి ఆపరేషన్లు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పవిత్ర, నేహ, నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసులు, రజిత, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

డేటా ఎంట్రీని వేగవంతం చేయండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయంలో డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. అవసరం అయితే సిబ్బందిని నియమించుకొని డేటా ఎంట్రీ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ ఒకే గదిలో నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌కు సూచించారు. అంతకుముందు వికారాబాద్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. వంటగది, కిచెన్, విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు.

పాఠశాలలకు నిధుల విడుదల

జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థ, ఆదర్శ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ(మూడు నెలలకు గాను)కు రూ.1.68 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. పాఠశాలల పరిసరాలు, మరుగుదొడ్ల నిర్వహణకు ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు.

ప్రజావాణికి 113 దరఖాస్తులు

ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పలు సమస్యలపై ప్రజలు ఇచ్చే దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి పరిష్కరించాలని, లేనిపక్షంలో అందుకు గల కారణాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వికారాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

క్లుప్తంగా

పోక్సో కేసులో మూడేళ్ల జైలు

బాధితురాలికి రూ.లక్ష పరిహారం



మహ్మద్‌ జియాన్‌, నిందితుడు

పహాడీషరీఫ్‌: బాలికపై లైంగిక దాడికి యత్నించిన యువకుడికి మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ ఎల్బీ నగర్‌ ఫాస్ట్‌ ట్రాక్‌ కోర్టు సోమవారం తీర్పు నిచ్చింది. ఇన్‌స్పెక్టర్‌ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఉస్మాన్‌నగర్‌కు చెందిన మహ్మద్‌ జియాన్‌ అలియాస్‌ మహ్మద్‌ ఉమర్‌(23) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2020లో ఓ బాలికను ప్రేమ పేరుతో వేధించి అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక దాడికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఫాస్ట్‌ ట్రాక్‌ కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. కేసు విచారించిన న్యాయమూర్తి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.లక్ష పరిహారం ప్రకటించారు.

ఆన్‌లైన్‌ మోసాలపై ఫిర్యాదులు

ఇబ్రహీంపట్నం: ఆన్‌లైన్‌ మోసాలకు సంబంధించి బాధితుల నుంచి ఇబ్రహీంపట్నం పోలీసులకు సోమవారం రెండు ఫిర్యాదులు అందాయి. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. ఇబ్రహీంపట్నంకు చెందిన టి.వెంకటేశ్‌గౌడ్‌కు మీ కూతురు డ్రగ్స్‌ కేసులో పట్టుబడిందని సీబీఐ పేరుతో గుర్తుతెలియని అగంతకుడు ఫోన్‌ చేశాడు. అర్జెంట్‌గా రూ.30వేలు పంపాలని ఫోన్‌ పే నంబర్‌ను పంపించాడు. దీంతో అనుమానం వచ్చిన వెంకటేశ్‌ పోలీసులను ఆశ్రయించాడు. మరో కేసులో ఇబ్రహీంపట్నంకు చెందిన బి.రమేష్‌ క్రెడిట్‌ కార్డ్స్‌ నుంచి ఓటీపీలు వచ్చి రూ.96 వేలు కట్‌ అయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్‌ క్రైం పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. కాగా మోసాపూరితమైన కాల్స్‌, సైబర్‌ నేరాలపై 1930 నెంబర్‌కు బాధితులు నేరుగా కాల్‌ చేయాలని ఎస్‌ఐ రామకృష్ణ సూచించారు.

ఐదేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం

నిందితుడికి 20 ఏళ్ల జైలు

యాచారం: ఐదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తికి సోమవారం రంగారెడ్డి జిల్లా కోర్టు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించింది. యాచారం సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రా మానికి చెందిన వరికుప్పల మహేష్‌ ఈ ఏడాది మార్చి 13న గ్రామంలో తన పక్కింట్లో ఉండే ఓ ఐదేళ్ల బాలికకు మాయ మాటలు చెప్పి ఇంటి పైకి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యాచారం పోలీసు లు కేసు నమోదు చేసి మహేశ్‌ను రిమాండ్‌కు తరలించారు. అనంతర ం పూర్తి వివరాలను జిల్లా కోర్టులో సమర్పించారు. విచారణ చేపట్టిన జిల్లా కోర్టు సోమవారం నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

కారు బీభత్సం



ప్రమాదానికి గురైన కారు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌లో ఆదివారం అర్ధరాత్రి ఒక బెంజ్‌ కారు బీభత్సం సృష్టించింది. బంజారాహిల్స్‌ పోలీసుల కథనం ప్రకారం. ఆదివారం రాత్రి బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-1లోని సిటీ సెంట్రల్‌ వైపు నుంచి రోడ్డునెంబర్‌-10 వైపు వెళ్తున్న బెంజ్‌ కారు అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న బంజారాహిల్స్‌ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ పోలీసుల సాయంతో కారు నడుపుతున్న నజీర్‌ అనే వ్యక్తికి డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించలేదని తేలింది. ప్రమాద సమయంలో కారు యజమానితో పాటు ఆయన భార్య కారులోనే ఉన్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మద్యం మత్తులో ఒక మహిళ ఈ ప్రమాదానికి పాల్పడినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో సీసీ ఫుటేజీలను పరిశీలించి కారు ఎవరు నడుపుతున్నారనేది తేలుస్తామని పోలీసులు స్పష్టం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రింగ్‌ బాక్స్‌ల చోరీ ముఠా గుట్టురట్టు

శివారు ప్రాంతాల్లోని సైట్లే లక్ష్యం

- రూ.25లక్షల విలువైన 48 టన్నుల సెంట్రింగ్‌ బాక్స్‌లు అపహరణ
- 18 మంది ముఠాలో ఎనిమిది మంది అరెస్ట్‌
- పరారీలో పదిమంది
- కేసు వివరాలు వెల్లడించిన సీఐ భూపాల్‌ శ్రీధర్‌, డీఐ రమేశ్‌నాయుడు



పోలీసుల అదుపులో నిందితులు, రికవరీ చేసిన సెంట్రింగ్‌ బాక్సులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ భూపాల్‌ శ్రీధర్‌, డీఐ రమేశ్‌ నాయుడు, ఎస్‌ఐలు

చేవెళ్ల: శివారు ప్రాంతాల్లో చేపట్టే బడా కన్‌స్ట్రక్షన్‌ల వద్ద, ఫామ్‌హౌస్‌ల వద్ద సెంట్రింగ్‌ బాక్స్‌లు చోరీ చేసే ముఠా ఆటకట్టించారు చేవెళ్ల పోలీసులు. ఈ ముఠా ఆరు నెలలుగా చేవెళ్ల ప్రాంతంలో 11 కేసులకు సంబంధించి రూ.25లక్షల విలువ చేసే 48 టన్నుల సెంట్రింగ్‌ బాక్స్‌లను చోరీ చేసింది. 18 సభ్యులున్న ఈ ముఠానాయకుడితో పాటు ఎనిమిది మందిని అరెస్ట్‌ చేసి 43 టన్నుల సెంట్రింగ్‌ బాక్స్‌లను రికవరీ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు విచారణకు కస్టడీకి తీసుకోగా ముఠా గుట్టు రట్టయింది. సోమవారం కేసు వివరాలను చేవెళ్ల ఠాణాలో సీఐ భూపాల్‌ శ్రీధర్‌, డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌ రమేశ్‌నాయుడు, ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డితో కలిసి వెల్లడించారు.

ముఠా నాయకుడికి ముగ్గురు అనుచరులు

హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌ బోలక్‌పూర్‌కు చెందిన మోసిన్‌అహ్మద్‌కు స్క్రాప్‌ దుకాణం ఉంది. యూపీకి చెందిన కూలీలతో సంబంధాలు పెట్టుకుని 18 మందితో ఓ ముఠాగా ఏర్పడి సెంట్రింగ్‌ బాక్స్‌ల చోరీకి పాల్పడుతున్నారు. ఎ–1 మోసిన్‌ అహ్మద్‌కు ప్రధాన అనుచరులుగా యూపీకి చెందిన అల్తాఫ్‌ హుస్సేన్‌, ఇమ్రాన్‌, అఖిల్‌ బాజ్‌పేయి ఉంటున్నారు. వీరు యూపీకి చెందిన ఇతర కూలీ పనులు చేసుకుంటూ వేర్వేరు ప్రాంతాల్లో ఉండే వారితో మాట్లాడి ఎంపిక చేసిన చోట రాత్రి సమయంలో చోరీకి పాల్పడుతుంటారు. కూలీకి వచ్చిన వారికి వాహనాల ఏర్పాటు, వారికి డబ్బులు ఇచ్చే పనులు ఈ ముగ్గురు అనుచరుల్లో ఎవరో ఒకరు చూసుకుంటారు. చోరీ చేసిన సెంట్రింగ్‌ బాక్స్‌లను అనుచరుల్లో ఒకరు నార్సింగ్‌ వద్ద మోసిన్‌ అహ్మద్‌కు అప్పగిస్తారన్నారు. అతడు వాటిని తీసుకెళ్లి ముషీరాబాద్‌లో వేరే వారికి సెంకడ్‌ హ్యాండ్‌ మాల్‌ అని అమ్మేస్తుంటాడని చెప్పారు. ఇలా ఈ ముఠా ఆరు నెలలుగా రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్‌ తదితర అనేక జిల్లాల్లో సెంట్రింగ్‌ బ్యాక్స్‌ల చోరీకి పాల్పడినట్లు తెలిపారు. అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించిన వారిలో ముఠానాయకుడు మోసిన్‌ అహ్మద్‌, ఎండీ రహమాన్‌, ఎండీ అర్బాజ్‌, ఎండీ అయాజ్‌, గుసావ్‌ అలీ, ఖలీమొద్దీన్‌, అన్సర్‌ అలీ, ఎండీ షకీల్‌లు ఉన్నట్లు తెలిపారు. మరో పది మంది నిందితులు పరారీలో ఉన్నారు.

నిందితులను పట్టుకున్న బాధితులు

హైదరాబాద్‌కు చెందిన సెంట్రింగ్‌ కార్మికులు రిజ్వాన్‌, హైమద్‌, సాదత్‌లు ఈనెల 8న మండల పరిధిలోని ముడిమ్యాల సమీపంలో ఫామ్‌హౌస్‌లలో సెంట్రింగ్‌ పనులకు వేసిన డబ్బాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో వీరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా అప్పటికే సెంట్రింగ్‌ డబ్బాలు చోరీకి గురైన కేసులు నమోదు అయ్యాయి. అన్ని శివారు ప్రాంతాల్లో ఉండడంతో పోలీసులు వీటిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఫిర్యాదు చేసిన బాధితులు మరోచోట సెంట్రింగ్‌ పనులకు డబ్బాలు వేసి ఉంచారు. ఈ నెల 9న ముడిమ్యాల మరో చోట సెంట్రింగ్‌ బాక్స్‌ల చోరీకి ఏడుగురు ముఠా సభ్యులు వచ్చారు. అప్పటికే అక్కడ మాటు వేసిన బాధితులు రిజ్వాన్‌, హైమద్‌, సాదత్‌ చోరీ చేస్తున్నవారిని పట్టుకుని పోలీసులుకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఏడుగురిని పట్టుకుని విచారించగా ముఠానాయకుడు మోసిన్‌ అహ్మద్‌ పేరు చెప్పడంతో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అప్పటికే చేవెళ్ల ప్రాంతంలోనే మొయినాబాద్‌లో మూడు చోట్ల, చేవెళ్లలో ఆరు చోట్ల, శంకర్‌పల్లి, మోకిల పీఎస్‌ల పరిధిలో రెండు కేసులు ఉండడంతో రిమాండ్‌కు పంపించిన వారిని విచారణకు పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. దీంతో వారిని విచారించగా ఈ 11 కేసులతో పాటు ఇతర జిల్లాలోనూ కేసులు ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈకేసులో పోలీసులకు సహకరించిన బాధితులు రిజ్వాన్‌, హైమద్‌, సాదత్‌లను పోలీసులు అభినందించారు. పరారీలో ఉన్న పది మందిని, మరో 20 శాతం సొత్తును త్వరలోనే రికవరీ చేస్తామన్నారు.

బాలిక అదృశ్యం



స్వాతి (ఫైల్‌)

తాండూరు రూరల్‌: బాలిక అదృశ్యమైన ఘటన కరన్‌కోట్‌ ఠాణా పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కరన్‌కోట్‌ గ్రామానికి చెందిన బక్క లాలమ్మ మనువరాలు స్వాతి(9) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతోంది. బాలిక తల్లి దండ్రులు మృతి చెందడంతో అమ్మమ్మ సంరక్షణలో ఉంటోంది. ఈ నెల 22న సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఇంటి సమీపంలోని కిరాణ దుకాణంలో ఉప్పు కొనుగోలుకు వెళ్లి తిరిగి రాలేదు. గతంలోనూ ఓ సారి ఇంటి నుంచి వెళ్లి పెద్దేముల్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చింది. తిరిగి వస్తుందని భావించి అమ్మమ్మ వేచి చూడగా రాలేదు. దీంతో ఆమె బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో లాలమ్మ సోమవారం కరన్‌కోట్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.



కరన్‌కోట్‌లో బాలిక ఆచూకీ కోసం వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తనిఖీలు ముమ్మరం

కరన్‌కోట్‌లో బాలిక కిడ్నాప్‌ వార్త ఆనోటా.. ఈనోటా దావానంలా వ్యాపించింది. గుర్తు తెలియని దుండగులు బాలికను పల్సర్‌బైక్‌పై తీసుకెళ్లారని ఓ యువకుడు పోలీసులకు చెప్పాడు. దీంతో ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తన బృందంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. బాలిక ఫొటోను సోషల్‌మీడియాలో పోస్టు చేసి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సర్వే వంద శాతం

- 30 లోగా డేటా ఎంట్రీ
- జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, ఇబ్రహీంపట్నం స్పెషలాఫీసర్‌ నవీన్‌



ఇబ్రహీంపట్నం: మండల పరిధిలో కులగణన సర్వే పకడ్బందీగా సాగుతోందని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, ఇబ్రహీంపట్నం స్పెషలాఫీసర్‌ కె.నవీన్‌కుమారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని 14 పంచాయతీల్లో 11,151 ఇళ్లను గుర్తించి 110 ఎన్యుమరేటర్‌ బ్లాక్‌లను ఏర్పాటు చేసి సర్వే చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 10,984 ఇళ్లను సర్వే(98.5 శాతం) పూర్తి చేశామన్నారు. ఉప్పరిగూడ, చర్లపటేల్‌గూడ, పోచారం గ్రామాల్లో వంద శాతం సర్వే పూర్తికాగా, మిగిలిన గ్రామాల్లో డోర్‌లాక్‌ ఉండటం, ఇతర ప్రాంతాలకు వెళ్లిన కుటుంబాలు ఉండటంతో సర్వేకు కొంత ఆటంకం ఏర్పడుతుందన్నారు. ఈ నెల 30 లోపు కులగణన ఆన్‌లైన్‌ డేటా ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇంకా సర్వే చేయించుకోని కుటుంబాలు ఉంటే ఇబ్రహీంపట్నం మండల పరిషత్‌ కార్యాలయానికి సంబంధించిన 9849126460 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

టిప్పర్‌ ఢీకొని బాలుడి మృతి

షాద్‌నగర్‌ రూరల్‌: టిప్పర్‌ ఢీకొని ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాంచందర్‌ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్‌ జమాల్‌(14) బస్టాప్‌ ఎదుట నుంచి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొందుర్గు నుంచి షాద్‌నగర్‌ వైపు ప్రయాణిస్తున్న టిప్పర్‌ అతివేగంగా వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్‌ ఘటనాస్థలిని పరిశబులించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టిప్పర్‌ డ్రైవర్‌ ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ నుంచి పరారయ్యాడు. మృతుడి తండ్రి లతీఫ్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్‌

షాపింగ్‌ కాంప్లెక్స్‌ భవనాలకు డ్రా

కద్తాల్‌: మండల కేంద్రంలో తెలంగాణ పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో నిర్మించిన పది షాపింగ్‌ కాంప్లెక్స్‌ భవనాలకు కందుకూర్‌ ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం డ్రా నిర్వహించారు. పది షాపులకు గాను, 70 మంది డీడీలు చెల్లించి ఆయా షాపింగ్‌ భవనాలకు తమకు నచ్చిన ధరను కోట్‌ చేస్తూ ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ ప్రతిమా సింగ్‌ పర్యవేక్షణలో, షాపుల వారీగా మొత్తం పది షాపులకు వరుసగా అత్యధిక ధర కోట్‌ చేసిన 10 మంది పేర్లను ప్రకటించారు.



లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న అధికారులు

ప్రభుత్వం ఆయా భవనాలకు నెలకు నిర్దిష్ట అద్దె రూ.10 వేలు, జీఎస్టీ నిర్ణయించగా, పోటీలో పాల్గొన్న వారు రూ.20 వేలకు పైగా కోట్‌ చేసి షాపులను కైవసం చేసుకున్నారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ గోపాల్‌, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్‌, జిల్లా ఆడిట్‌ అధికారులు పాల్గొన్నారు.

దొంగకు రిమాండ్‌



నిందితుడు స్వామి

కందుకూరు: ఓ మహిళ మెడలో నుంచి నకిలీ బంగారు పుస్తెలతాడును అపహరించిన దొంగను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్‌ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గుమ్మడవెల్లి సమీపంలో మేకలు మేపడానికి వెళ్లిన జంగమ్మ మెడలోంచి ఆదివారం బైక్‌పై వచ్చిన దొంగ, నకిలీ బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోగా మార్గమధ్యలో బేగంపేట గ్రామస్తులు అతన్ని అడ్డుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన విషయం విదితమే. కాగా నిందితుడిని ఖమ్మం జిల్లా మధిర మండలం, మాడుపల్లి గ్రామానికి చెందిన గ్యారపాటి స్వామి(37)గా గుర్తించారు. ఈ మేరకు సోమవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు.

ప్రీ లాంచ్‌ ఆఫర్స్‌ పేరుతో రూ.48 కోట్లకు టోకరా

ఆర్‌–హోమ్స్‌ సంస్థ నిర్వాహకుల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ఎలాంటి అనుమతులు లేకుండా నగర శివార్లలోని వెంచర్లు వేయడంతో పాటు వాటిలో ప్రీ లాంచ్‌ ఆఫర్ల పేరుతో 200 మంది నుంచి దాదాపు రూ.48 కోట్లు వసూలు చేసి మోసం చేసిన ఆర్‌–హోమ్స్‌ ఇన్‌ఫ్రా డెవలపర్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ నిర్వాహకులను సైబరాబాద్‌ ఎకనమికల్‌ అఫెన్సెస్‌ వింగ్‌ (ఈఓడబ్ల్యూ) అధికారులు సోమవారం అరెస్టు చేశారు. వీరివద్ద పెట్టుబడి పెట్టి రూ.65.5 లక్షలు నష్టపోయిన వి.మనోజ్‌కుమార్‌ సహా మరికొందరు ఫిర్యాదు మేరకు శుక్రవారం ఈ కేసు నమోదైంది. కూకట్‌పల్లి కేంద్రంగా కార్యకలాపాలు సాగించిన ఈ సంస్థకు చుక్కా భాస్కర్‌ ఎండీగా, ఆయన భార్య సుధారాణి డైరెక్టర్‌గా ఉన్నారు. వీరు సంబంధిత విభాగాల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నగర శివార్లలో బిల్లస్‌ హైట్స్‌, ఓఆర్‌ఆర్‌ హైట్స్‌, ఫార్మ్‌ ల్యాండ్‌ ప్రాజెక్టులు చేపట్టారు. ప్రీ లాంచ్‌ ఆఫర్‌ పేరుతో తక్కువ దరకే ప్లాట్లు, ఫ్లాట్లు ఇస్తున్నట్లు ప్రకటించారు. కొనుగోలుదారులను ఆకర్షించడానికి ప్రముఖులతో ప్రచారం చేయించారు. దీంతో అనేక మంది మధ్య తరగతి, దిగువ మధ్య తరగతికి చెందిన వారు తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలనే వీరి వద్ద ఫ్లాట్లు బుక్‌ చేసుకున్నారు. మూడేళ్లల్లో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, అలా కాని పక్షంలో డబుల్‌ బెడ్‌ రూమ్‌కు రూ.6 వేలు, త్రిపుల్‌ బెడ్‌రూమ్‌కు రూ.8 వేలు చొప్పున పూర్తయ్యే వరకు అద్దె చెల్లిస్తామని నమ్మ బలికారు. నిర్మాణంలో జాప్యంపై బాధితులు ప్రశ్నించగా ధరణి, ఎన్నికలు సహా అనేక కారణాలు చెబుతూ తప్పించుకున్నారు. ఎట్టకేలకు మోసపోయినట్లు గుర్తించిన కొందరు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన ఈఓడబ్ల్యూ నిందితులను అరెస్టు చేసింది.

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వికారాబాద్‌ అర్బన్‌: హిందూ జనశక్తి మాణిక్‌ ప్రభు సంస్థాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది గిరి ప్రదక్షిణ నిర్వహిస్తుంటారు. సోమవారం నిర్వహించిన ఈ ప్రదక్షిణకు వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. మాణిక ప్రభు సంస్థాన్‌ బాల మార్తాండ మహరాజ్‌ అనంతగిరి పరిరక్షణ సమితి సభ్యులు, హిందూ జనశక్తి నాయకులతో ఈ యాత్ర ఉదయం 5గంటలకు రాజీవ్‌ నగర్‌లోని భవాని మాత ఆలయం నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ మేకల గండి నుంచి శుభం ఫంక్షన్‌హాల్‌ గోధుమగూడా మీదుగా జైదుపల్లి, కెరెల్లి సత్యసాయి కేంద్రం, బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం, బండ బావి హనుమాన్‌ ఆలయం అనంతరం అనంత పద్మనాభ స్వామి ఆలయానికి యాత్ర చేరుకుంది. ఈ గిరి ప్రదక్షిణ యాత్రకు ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌, రమేష్‌కుమార్‌, హాజరయ్యారు. ప్రదక్షిణలో హిందూ జనశక్తి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌ యాదవ్‌, హిందూ జనశక్తి రంగారెడ్డి జిల్లా లీగల్‌ సెల్‌ కన్వీనర్‌ మాధవ్‌రెడ్డి, అనంతగిరి పరిరక్షణ సమితి సభ్యులు నర్సింలు, అంజిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, డాక్టర్‌ రాజశేఖర్‌, శివరాజ్‌, యాదగిరి, మోహన్‌రెడ్డి, విజయలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధన



కొడంగల్‌ రూరల్‌: స్వామివారి సన్నిధిలో అయ్యప్ప స్వాములు

కొడంగల్‌ రూరల్‌: కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకొని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు. పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయం, గాడిబాయి శివాలయం, బసవేశ్వర ఆలయాలలో మహిళలు, భక్తులు దీపారాధన చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. రావులపల్లి మాజీ సర్పంచ్‌ రమేష్‌రెడ్డి దేశ్‌ముఖ్‌, ప్రదీప్‌రెడ్డి దేశ్‌ముఖ్‌లు మహాదేవుని ఆలయంలో శివలింగానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అయ్యప్ప స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మంగళహారతులు అందించారు.



ధారూరు: ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

వీరభద్రేశ్వర ఆలయంలో..

ధారూరు: మండల కేంద్రంలోని శ్రీ వీరభద్రేశ్వర ఆలయంలో కార్తీకమాస చివరి సోమవారం కావడంతో ప్రత్యేక పూజలను పూజారి చెన్న బసవయ్యస్వామి నిర్వహించారు. ఆలయలో నెలకొన్న మహాగణపతి, కపిలేశ్వరస్వామి, పార్వతీమాత, వీరభద్రేశ్వరస్వామి, నాగదేవత, నందీశ్వరస్వామి, కుమారస్వామిలతో పాటు నవగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు కార్తీక దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

రూ.16 కోట్లతో ట్యాంకుల నిర్మాణం



ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్‌

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పట్టణంలో నీటి కష్టాలు తలెత్తకుండా రూ.16కోట్లు వెచ్చించి ట్యాంకులు నిర్మిస్తున్నామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణం కేంద్రంలోని తిరుమల వెంచర్‌, వెంకటేశ్వర కాలనీ, శ్రీనివాస కాలనీల్లో అమృత్‌ 2.0 పథకంలో భాగంగా రూ.15 కోట్ల వ్యవయంతో ట్యాంకుల నిర్మాణానికి, మిట్టకోడూర్‌లో సైడ్‌ డ్రైన్‌ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవిలో పట్టణ ప్రజలకు నీటి కష్టాలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. త్వరలోనే రూ.25 కోట్ల వ్యయంతో పట్టణ కేంద్రంలో అభివృద్ధి పనులను చేపడుతామన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ ముకుందఅశోక్‌కుమార్‌, కమిషనర్‌ వెంకటయ్య, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పరశురాంరెడ్డి, వైస్‌ చైర్మన్‌ అయూబ్‌, కౌన్సిలర్లు శ్రీనివాస్‌, మల్లేష్‌, నాగేశ్వర్‌, వెంకటయ్య, మల్లేష్‌, రహీర్‌, మౌలానా, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంత్‌ముదిరాజ్‌, ఏ–బ్లాక్‌ అధ్యక్షుడు పార్థసారథి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని చిదిమేసిన కారు

ఘటనా స్థలిలోనే మృతి చెందిన రెండేళ్ల బాలిక

మీర్‌పేట: రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు వారివి. ఉన్నంతలోనే తమ ముగ్గురు పిల్లల ఆలనా పాలనా చూసుకుంటున్న తరుణంలో ఓ కారు ఆ దంపతులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఇంటి ఎదుట ఆడుకుంటున్న చిన్నారిని కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన చిన్న తిరుపతయ్య, బాల వెంకమ్మ దంపతులు బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం నగరానికి వచ్చి భూపేష్‌గుప్తానగర్‌ వనపురి కాలనీ సమీపంలో గుడిసె వేసుకుని నివాసముంటున్నారు. తిరుపతయ్య ఇంటింటికి తిరిగి గ్యాస్‌స్టవ్‌ రిపేర్లు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. చిన్న కుమార్తె తిరుమల బాలమ్మ(2) సోమవారం సాయంత్రం స్థానికంగా ఉండే పిల్లలతో కలిసి ఇంటి ఎదుట ఆడుకుంటోంది. అదే సమయంలో డ్రైవర్‌ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా కారుతో చిన్నారిని ఢీకొట్టి, తలపై నుంచి వెళ్లడంతో సంఘటనా స్థలిలోనే మృతి చెందింది. గమనించిన స్థానికులు కారు డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్‌ నాగరాజు తెలిపారు.

‘రైతు భరోసా’కు కార్యాచరణ

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్‌: రైతు భరోసా పథకం అమలు చేసేందుకు ప్రభు త్వం కార్యాచరణ రూపొందిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆమనగల్లు పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో ముద్వీన్‌ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజా పాలన సాగిస్తుంది అన్నారు. ఇప్పటికే సన్నాలకు రూ.500 బోనస్‌ అందజేస్తున్నామని గుర్తు చేశారు. అనంతరం ముద్వీన్‌ గ్రామస్తులు ఎక్వాయిపల్లి నుంచి ముద్వీన్‌ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌ విండో చైర్మన్‌ గంప వెంకటేశ్‌గుప్తా, మార్కెట్‌ కమిటీ చైర్‌ పర్సన్‌ యాట గీత, మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్‌, నాయకులు రాములుగౌడ్‌ నరేశ్‌ నాయక్‌, హన్మానాయక్‌, శేఖర్‌గౌడ్‌, వెంకటేశ్‌, అశోక్‌, మధు, వినోద్‌, గోపాల్‌, నర్సింహగౌడ్‌, జహంగీర్‌అలీ, మార్కెట్‌, సింగిల్‌విండో డైరెక్టర్లు శ్రీశైలం, అజీం, నరేశ్‌నాయక్‌, వెంకటయ్య, రాంచంద్రయ్య, వెంకటయ్య, ,సుమన్‌, మల్లేశ్‌, జంగయ్య, పీఏసీఎస్‌ సీఈఓ దేవేందర్‌, మండల వ్యవసాయ అధికారి శ్రీలత, ఏఈఓలు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. సోమవారం ఆయన కాంగ్రెస్‌ ముద్వీన్‌ గ్రామ అధ్యక్షుడు మధు నివాసంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ శ్రేణుల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఆరాతీశారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని సూచించారు.

పదునెట్టాంబడి పూజకు ఆహ్వానం

మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో డిసెంబర్‌ 2న నిర్వహించనున్న అయ్యప్ప స్వామి 18వ మహాపడి పూజా కార్యక్రమానికి గురుస్వామి బిక్కునాయక్‌ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వాములు ఎమ్మెల్యేను సత్కరించి, ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ భాస్కర్‌ రెడ్డి, నాయకులు హన్మానాయక్‌, శేఖర్‌గౌడ్‌, జగన్‌, లక్ష్మణ్‌నాయక్‌, ప్రభులింగం తదితరులు ఉన్నారు.